




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 72 | మంగళవారం 11 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-







VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 72 | మంగళవారం 11 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# వర్షాల కోసం వరుణ యాగం..
## సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి



- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం
- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమ గుండాలతో యాగం

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం: సీఎం చంద్రబాబు



- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం

# తూర్పు చైనాను అతలాకుతలం చేస్తున్న డాల్ఫిన్ టైఫూన్

- 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వేలాది విమానాలు, రైళ్లు రద్దు.. స్తంభించిన జనజీవనం
- ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన తుఫాను ఇదే



# హర్మూజ్ జలసంధి పై వీడని ఉత్కంఠ..
## అమెరికా, ఇరాన్‌ల పరస్పర విరుద్ధ ప్రకటనలు

- ఇరాన్‌తో పాక్షికంగానే చర్చలు జరుపుతున్నామన్న ట్రంప్
- సైనిక చర్యకు బదులు ఆర్థిక ఒత్తిడి పెంచడానికే మొగ్గుచూపుతున్నామని వెల్లడి
- అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని మరోసారి స్పష్టం చేసిన ఇరాన్



# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు:
## పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్

- దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి
- పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ
- ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్



# 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి: బండి సంజయ్



ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు: పవన్ కల్యాణ్



- గోవింద నామాలను పేరడీ చేయడం పై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని
- భక్తుల మనోభావాలను కించపరిచే కుట్రపూరిత చర్యగా అభివర్ణన
- ఈ ఘటన పై చట్టపరంగా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం
- దైవ నామాలను అపహాస్యం కోసం వాడొద్దని హితవు

## తూర్పు చైనాను అతలాకుతలం చేస్తున్న డాల్ఫిన్ టైఫూన్

ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ 'డాల్ఫిన్' తూర్పు తీర ప్రాంతంలో ప్రళయం సృష్టిస్తోంది. ఆదివారం సాయంత్రం తీరం దాటిన ఈ టైఫూన్ కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టైఫూన్ ప్రభావంతో రవాణా, పర్యాటక రంగాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ నగరం సమీపంలో డాల్ఫిన్ టైఫూన్ తీరాన్ని తాకింది. ఆ సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గంట వ్యవధిలోనే సమీపంలోని వెన్‌జౌ నగరం వద్ద రెండోసారి తీరం దాటింది. దీంతో అధికారులు దేశంలోనే అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. టైఫూన్ తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు చేపట్టిన సహాయక చర్యలు మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఉన్నాయి. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 9 లక్షల మందిని, తైజౌలో 3.90 లక్షల మందిని, ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1.67 లక్షల మందిని, షాంఘైలో 2.15 లక్షల మందికి పైగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 1,500 అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. టైఫూన్ కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క షాంఘైలోనే సుమారు 1,500 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హ్యాంగ్‌జౌ విమానాశ్రయంలోనూ వందలాది విమానాలు నిలిచిపోయాయి. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 686 రోడ్డు మార్గాలు, 658 రైలు సర్వీసులను నిలిపివేశారు. పోర్టులు, ఫెర్రీ సేవలు కూడా మూతపడ్డాయి. షాంఘైలోని ప్రఖ్యాత లెగోలాండ్ రిసార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అలాగే, 234 ప్రధాన పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దాదాపు 6,000 కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకడం ఈ టైఫూన్ ప్రత్యేకత. జులై చివరిలో మార్షల్ దీవుల వద్ద ఏర్పడిన ఈ టైఫూన్, చైనాకు రాకముందు జపాన్‌లోని ఒకినావా, ఫిలిప్పీన్స్ దేశాలపై కూడా తన ప్రభావాన్ని చూపింది. సోమవారం నాటికి టైఫూన్ బలహీనపడినా, ఇది దేశంలోని లోతట్టు ప్రాంతాల వైపు కదులుతోంది. దీనివల్ల రాజధాని బీజింగ్‌తో సహా 10కి పైగా ప్రావిన్సులలో రాబోయే రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బీజింగ్‌లో ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసి, వరద నియంత్రణ చర్యలు చేపట్టారు.

## హర్మూజ్ జలసంధి పై వీడని ఉత్కంఠ.. అమెరికా, ఇరాన్‌ల పరస్పర విరుద్ధ ప్రకటనలు

ఇరాన్‌తో తాము 'పాక్షికంగానే చర్చలు' జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్యకు ఆదేశించే బదులు, ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచడానికే తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. యాక్సియోస్ వార్తా సంస్థతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్, ఈ విషయాన్ని తాము పెద్దదిగా చేయడం లేదని అన్నారు. ఆర్థికంగా ఇరాన్ చాలా బలహీనమైన స్థితిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రించేందుకు అమెరికా, ఇరాన్, ఒమన్ మధ్య ఒక ఒప్పందం కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి కూడా స్పందించారు. హర్మూజ్ జలసంధిలో తాత్కాలిక సముద్ర మార్గం ఏర్పాటుపై ఒమన్‌తో తాము ఒక ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించడం ఆపేంత వరకు ఆ దేశంతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అరాఘ్చి ఆదివారం టెహ్రాన్‌లో స్పష్టం చేశారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలు గత కొన్ని రోజులుగా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గత మంగళవారం ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌తో తాము చాలా మంచి చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కానీ, వాషింగ్టన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని టెహ్రాన్ వెంటనే ఖండించింది.

## ఉదయ్ కృష్ణారెడ్డి కేసును సీఐడీకి అప్పగించాలి

హైదరాబాద్ లోని జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసును వెంటనే సీబీసీఐడీకి బదిలీ చేయాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేరుగా జోక్యం చేసుకోవడంపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఈ–మెయిల్ ద్వారా 4 పేజీల లేఖ పంపినట్లు ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో వెల్లడించారు. కస్టోడియల్ విచారణలో ఉదయ్ కృష్ణారెడ్డి ని సజ్జనార్ ఎన్‌కౌంటర్ చేస్తానంటూ బెదిరించినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. మణిపూర్ క్యాడర్‌కు చెందిన సదరు మహిళా ఐపీఎస్ అధికారిణికి, 2025 బ్యాచ్ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సోషల్ మీడియా ద్వారా పరిచయమై వ్యక్తిగత సంబంధంగా మారిందని, ఇది విఫలమైన వ్యక్తిగత బంధం నుంచి పుట్టుకొచ్చిన కేసని నాగేశ్వరరావు తెలిపారు. పోష్ చట్టం కింద అంతర్గత విచారణ పూర్తికాకముందే, ఎలాంటి ఆధారాలు నాశనం చేయకపోయినా పోలీసులు తొందరపడి ఉదయ్‌ను అరెస్ట్ చేశారని విమర్శించారు. మొదట ఇచ్చిన ఫిర్యాదులో లేని అత్యాచారం, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లను రిమాండ్ నివేదికలో హడావుడిగా ఎందుకు చేర్చారో తేలాల్సి ఉందన్నారు. ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో నిందితులను పట్టుకోని పోలీసులు... పర్యవేక్షణాధికారి కాని సజ్జనార్ నాయకత్వంలో ఈ కేసుపై అసాధారణ ఆసక్తి చూపడం, సీసీటీవీలు లేని చోట విచారించి ఎన్‌కౌంటర్ బెదిరింపులకు దిగడంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డీజీపీని కోరారు.

## వర్షాల కోసం వరుణ యాగం.. సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

## 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22–ఎ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ–కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు.

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు: పవన్ కల్యాణ్

దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు: పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018–2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి: బండి సంజయ్

ఇందులో భాగంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను సోమవారం ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 'హర్‌ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఈరోజు నుంచి 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతం గా నిర్వహించాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగ స్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్ల పై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం పై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. 'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతం గా వ్యవహరించాలని సూచించారు.

## విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యల పై చర్చకు సిద్ధం

దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, వారి పై పోలీసు చర్యల పై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు కేంద్రం సిద్ధమేనని ఆయన సోమవారం తెలిపారు. అయితే, సభా కార్యక్రమాలను అడ్డుకునేలా విపక్షాలు హంగామా చేయకూడదని స్పష్టం చేశారు. 'విద్యార్థుల ఉద్యమం, దానికి సంబంధించిన పరిణామాల పై పూర్తి స్థాయి, సవివరమైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే చర్చ జరుగుతున్నప్పుడు, హోంమంత్రి లేదా ప్రభుత్వం సమాధానం ఇస్తున్న సమయంలో విపక్షాలు సభలో అంతరాయం కలిగించ కూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వారు వినాలి' అని రిజిజు పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్స్, బిహార్‌లోని సివాన్‌లో ఏకే-47 వినియోగం పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఓ జాతీయ పత్రికలో రాసిన వ్యాసం నేపథ్యంలో కేంద్రం ఈ ప్రకటన చేయడం గమనార్హం. విద్యార్థుల పై జరిగిన పోలీసు చర్యల పై హోంమంత్రి అమిత్ షా ఇప్పటివరకు ఎలాంటి విచారణకు ఆదేశించలేదని, కనీసం ప్రకటన కూడా చేయలేదని ఆ వ్యాసంలో రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థుల పై జరిగిన దాడిని హోంమంత్రి సమర్థిస్తున్నారనే విషయాన్ని ఆయన మౌనం స్పష్టం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశం పై పార్లమెంట్‌లో చర్చకు విపక్షాలు ప్రతిరోజూ నోటీసులు ఇస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థుల పై టియర్ గ్యాస్, మేకులు అమర్చిన లాఠీలతో దాడి చేశారని, పెల్లెట్ గన్స్ ప్రయోగించారని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో ఏకే-47 వినియోగం పైనా ఎంపీ ప్రశ్నలు లేవనెత్తారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 11 ఆగష్టు 2026

## హక్కుల సాధనకు యూటీఎఫ్ పోరాటం



బాపట్లఆగస్టు 10 వార్త సాక్ష్యం

బాధ్యతలు, హక్కులు రెండూ ముఖ్యమేనని, వాటిని రెండు నేత్రాలుగా భావించి పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ అని బాపట్ల జిల్లా యూటీఎఫ్ కోశాధికారి ఎం. వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ 53వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు వై.వి. నారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా బాధ్యతగా పనిచేస్తూనే హక్కుల సాధన కోసం పోరాడటం యూటీఎఫ్ లక్ష్యమన్నారు.ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని, పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బీవీ శ్రీనివాస్, ప్రతినిధులు వి. రాఘవేంద్ర, ఇనకొల్లు పోలీసురావు, సీహెచ్. అజయ్ కుమార్, సతీష్, యేసురాజు, బాబూజీరెడ్డి, కె. విమలమ్మ, వర్ధన్ రెడ్డి, గణపతిరెడ్డి, రాజశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.ం

## క్రీడాకారులను ప్రోత్సహించాలి



పీవీ పాలెంఆగస్టు 10 వార్త సాక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలోని కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 జిల్లాల నుంచి సుమారు 420 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న స్పోర్ట్స్ రిజర్వేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన 14 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంబాప్రసాద్ తెలిపారు. అనంతరం జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌గా ఎన్నికైన నిజామ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో డా. బాలాజీ నాయక్, సలగల రాజశేఖర్, రాంబాప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గానికి ఆనందబాబు అభినందనలు



వేమూరుఆగస్టు 10 వార్త సాక్ష్యం

పెరవలి మత్స్యకార సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు బొమ్మిడి అంకమ్మరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ ఎన్నిక వివరాలను తెలిపారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయడంతో పాటు సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.28-07-2026 నుంచి 27-07-2031 వరకు పదవీకాలం కొనసాగనున్న నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బొమ్మిడి అంకమ్మరావు, ఉపాధ్యక్షుడిగా ఒడుగు శ్రీనివాసరావు, కార్యదర్శిగా అవనిగడ్డ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా ఒడుగు శివాజీ, పీతా వెంకట సుబ్బారావు, కత్తి అర్జునరావు, అవనిగడ్డ వీరలంకయ్య, బొమ్మిడి నాంచారయ్య, శ్యాకం శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

# రైతు భాంధవుడు, అపరభగీరధుడు బుడ్డా వెంగళరెడ్డి

**-వెంగళరెడ్డి విగ్రహావిష్కరణ నేడే.**

వెలుగోడు ఆగష్టు 10 వార్త సాక్ష్యం

వెలుగోడు మండల ప్రజలకు వన్ ఆర్,వన్ ఎల్ తూములను నిర్మించి రైతాంగం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అపర భగీరథుడు బుడ్డా వెంగళరెడ్డి చిరస్మరణి యుడు. ఆయన విగ్రహాన్ని మంగళవారము వెలుగోడు రిజర్వాయర్ కట్ట వద్ద శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి తనయుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రారంభిస్తున్నట్లు అబ్దుల్ కలాం , అన్నారపు శేషారెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పాలనాకాలంలో తమిళనాడు నీటి అవసరాలకై వెలుగోడు వద్ద తెలుగుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మిస్తున్న సందర్భంగా అప్పటి ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే దివంగత బుడ్డా వెంగళరెడ్డి ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పోరాడారు. రిజర్వాయర్‌కు వన్ ఆర్ మరియు వన్ ఎల్ తూములు ఏర్పాటు చేయాలని, లేనిచో రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనని ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కు ఖరాఖండిగా తేల్చిచెప్పారు. తన పట్టుదలతో ప్రభుత్వాన్ని ఒప్పించి, తూముల నిర్మాణాన్ని పూర్తి చేయించారు. తద్వారా 15 వేల ఎకరాల బీడు భూములకు నీరందించి, వెలుగోడు మండలాన్ని సస్యశ్యామలం చేసిన ప్రజా నాయకుడు అలాగే ఆత్మకూరు మండలం సిద్దేశ్వరం ఎత్తి పోతల పథకానికి కూడా కృషి చేసిన వ్యక్తి బుడ్డా వెంగళ రెడ్డి



వెలుగోడు : ఒన్ ఆర్ తూము ను ప్రారంభిస్తున్న బుడ్డా వెంగళరెడ్డి ( పైల్ ఫోటో )

అని తెలుగుదేశం నాయకులు తెలిపారు.

# నేడు మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ ఆవిష్కరణ

**-వెలుగోడు మండల రైతాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు.**

**-తెలుగు గంగ జలాశయం వద్ద నేడు ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి**

**-27వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం ప్రక్కన ఏర్పాటు చేసిన రైతులు.**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం







తెలుగుదేశం పార్టీ రాయలసీమ సీనియర్ నాయకుడు, దివంగత మాజీ కరువు శాఖ మంత్రివర్యులు బుడ్డా వెంగళరెడ్డి 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలకు గాను వెలుగోడు రైతాంగం తరపున వెలుగోడు తెలుగు గంగ జలాశయం నందు గల స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం ప్రక్కనే స్వర్గీయ బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కేవలం మద్రాసు కు త్రాగునీటి అవసరాల కోసం పైప్ లైన్ మాత్రమే ఏర్పాటు చెయ్యాలన్న ప్రతిపాదనను అడ్డుకొని తెలుగు గంగ జలాశయం నుంచి ఆ నాడు రైతుల కోసం ఓపెన్ కెనాల్ ఏర్పాటుకు కృషి చేసిన అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు మరువలేమని అలాగే మండలంలో ఎగువన ఉన్న 15వేల ఎకరాలకు కోసం వన్ - R మరియు వన్ - L తూములు ఏర్పాటు చేయాలని సొంత ప్రభుత్వంతో పోరాటం చేసి తూములు ఏర్పాటు చెయ్యకపోతే రానున్న ఎన్నికల్లో పోటీ చెయ్యను అని తేల్చి చెప్పి సాధించిన రైతాంగ భగీరథుడు బుడ్డా వెంగళరెడ్డి అని రైతులు పేర్కొన్నారు. అందుకు కృతజ్ఞతగానే స్వర్గీయ బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని తెలుగుగంగ జలాశయం వద్ద ఏర్పాటు చేసి, ఆయన తనయుడు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

# తెర్నేకల్లులో నేటి నుంచి తి.తి.దే ధార్మిక కార్యక్రమాలు

**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే**

కర్నూలు ఆగస్టు 10 వార్త సాక్ష్యం



తిరుమల తిరుపతి దేవస్థానములు (తితిదే) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్న మాధవస్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. నేటి నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీ నిత్యతృప్తదాసు స్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే ప్రతిరోజు భజనలు, శుక్రవారం గోపూజ మరియు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధార్మిక చైతన్యం, భక్తిభావం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాలకు సంబంధి ంచిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్క రిం పచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహ కులు కోరారు.




# పులిగోళలో ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్

**-ఆరు గోళ్లను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు**

**-విచారణలో వాస్తవాలను మీడియాకు వెల్లడి**

**-వన్యప్రాణులను వేటాడిన చంపిన కఠినమైన చట్టాలు అమలు**

**-ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం

శ్రీశైలం- నాగార్జున సాగర్ పెద్ద పులుల అభయారణ్యంలో గత వారం రోజుల క్రితం ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్ పరిధిలోని ఆరు పులి గోళ్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే సోమవారం పులి గోళ్ళ విషయంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా ఆత్మకూరు వన్య ప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావు మీడియాకు పలు వాస్తవాలను వెల్లడించారు గత వారం రోజుల క్రితం ఆత్మకూరు పట్టణానికి చెందిన తిమోతి, సిద్దాపురం గ్రామానికి చెందిన వన్య ప్రాణి వేటగాడు, కుంచాల మల్లికార్జున, బాపనంతపురం గ్రామానికి చెందిన కర్రవుల వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ చేయగా ఆ విచారణలో పులి గోళ్లను స్వాధీనం



చేసుకున్నట్లు వెల్లడించారు నల్లమల అడవి ప్రాంతంలో వన్యప్రానులను వేటాడిన చంపిన కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో మీడియాకు వివరించారు న్యాయస్థానం ముద్దాయిలకు స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు సమాచారం

**-పులి గోళ్ల కేసులో బైర్లూటి ఎఫ్ఆర్ఓ కృష్ణ ప్రసాద్ కు**

**-ఆత్మకూరు ఎఫ్ ఎస్ ఓ జ్యోతి స్వరూపుకు ప్రత్యేక అభినందనలు...**

ఆత్మకూరు పట్టణంలో పులిగోళ్ళు కలకలం రేపిన



కేసులో బైర్లూటి రేంజ్ అధికారి కృష్ణ ప్రసాద్ ఆత్మకూరు ఎఫ్ ఎస్ ఓ జ్యోతి స్వరూప్ ముగ్గురు ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకొని కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపిన సందర్భంగా అటవీ హక్కుల చట్టం కింద ముద్దాయిలకు తగిన శిక్ష పడేవిధంగా కృషి చేసిన బైర్లూటి రేంజర్, కృష్ణ ప్రసాద్ కు ఎఫ్ఎస్ఓ జ్యోతి స్వరూప్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేసినట్లు ఆత్మకూరు డిడిఓ విగ్నేష్ అప్పావో తెలియజేశారు

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 11 ఆగష్టు 2026

# ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్లో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ బృందం ఆధ్వర్యంలో శిక్షణ







**-నల్లమల రక్షణలో.. చెంచులే ప్రకృతి మార్గదర్శకులు**
**-పర్యాటకులకు అడవిని పరిచయం చేయడంలో కీలక పాత్ర**
**-ప్రకృతి పర్యాటకంతో ఉపాధి.. పరిరక్షణలో భాగస్వామ్యం**
**-నేచర్ గైడ్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు**
**-స్థానిక గిరిజనుల సహకారంతోనే అటవీ పరిరక్షణ మరింత బలోపేతం**
**-నల్లమల అడవుల్లో పర్యాటకులకు ప్రతి అణువు చూపించడమే మా లక్ష్యం**
**-డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ డైరెక్టర్ ఫరీదా టంపాల్**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం

నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో సోమవారం నాగులుటి ఎకో టూరిజం లో ప్రకృతి పర్యాటకం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానిక చెంచు గిరిజన యువతను నేచర్ గైడ్‌లుగా తీర్చిదిద్దడం ద్వారా అటవీ పరిరక్షణతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఎన్ఎస్టీఆర్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు (ఐఎఫ్ఎస్) అన్నారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయ డైరెక్టర్ ఫరీదా టంపాల్, రంపచోడవరం డిఎఫ్ఓ లు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల నేచర్ గైడ్ సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావ్ మాట్లాడారు.చెంచు గిరిజనులకు నల్లమల అడవులు వన్యప్రాణులు ప్రకృతి వనరులపై సహజమైన అవగాహన ఉందని వారి తరతరాల అనుభవానికి ఆధునిక నేచర్ గైడ్ నైపుణ్యాలను జోడించడం ద్వారా వారిని సమర్థవంతమైన ప్రకృతి మార్గదర్శకులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.అడవికి వచ్చే పర్యాటకులకు అక్కడి ప్రకృతి విశేషాలను పరిచయం చేయడంతో పాటు.శ్రీ అడవిలో ఎలా మెలగాలి వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా ప్రకృతిని ఎలా ఆస్వాదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించడంలో నేచర్ గైడ్‌ల పాత్ర కీలకమన్నారు.

**-నల్లమల్లకు పెరుగుతున్న పర్యాటకుల తాకిడి**

నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు



పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందని విఘ్నేష్ అప్పావు తెలిపారు.ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులకు సరైన మార్గనిర్దేశం అందించడం అటవీ నిబంధనలను పాటించేలా చూడటం వన్యప్రాణుల సంరక్షణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పర్యాటక కార్యకలాపాలను నిర్వహిం చడం ఎంతో అవసరమన్నారు. బాధ్యతా యుతమైన ప్రకృతి పర్యాటకం కేవలం పర్యాటకుల సంఖ్య పెరగడమే కాదని ప్రకృతిని కాపాడుతూ పర్యాటక అనుభూతిని అందించడమే దాని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందుకోసం స్థానికంగా అడవిపై అవగాహన ఉన్న యువతకు శాస్త్రీయంగా శిక్షణ ఇవ్వడం ఎంతో మంచి కార్యక్రమం అని తెలిపారు.

**-చెంచుల భాగస్వామ్యమే ప్రకృతికి బలం**

అటవీశాఖ ఎన్ని చర్యలు చేపట్టినా స్థానిక గిరిజనుల సహకారం లేకుండా అటవీ పరిరక్షణ పూర్తి స్థాయిలో సాధ్యం కాదని ఆయన అన్నారు. అడవులతో జీవన అనుబంధం కలిగిన చెంచు యువతను పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా అటవీశాఖకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు.నేచర్ గైడ్‌లుగా శిక్షణ పొందిన యువత తమ ప్రాంతాల్లోనే పర్యాటకులకు మార్గదర్శకత్వం వహిస్తూ ఒకవైపు ప్రకృతి విలువలను తెలియ జేయడంతో పాటు మరోవైపు అటవీ పరిరక్షణకు వారధులుగా నిలవాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు అడవిపై వారి బాధ్యత మరింత పెరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

**-డబ్ల్యూడబ్ల్యూఎఫ్ చొరవ అభినందనీయం**




చెంచు యువతకు నేచర్ గైడ్ శిక్షణ అందించేందుకు ముందుకు వచ్చిన డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సంస్థ చొరవను డిప్యూటీ డైరెక్టర్ అభినందించారు. అటవీశాఖతో సమన్వయంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్థానిక గిరిజన సమాజానికి అటవీ పరిరక్షణకు ప్రకృతి పర్యాటకానికి మేలు జరుగుతుందని తెలిపారు.నాలుగు రోజుల శిక్షణలో ప్రకృతి సందర్శన సందర్శకుల అనుభవం కమ్యూనిటీ గైడెన్స్ వన్యప్రాణుల పరిశీలన అటవీ సంకేతాల గుర్తింపు తదితర అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ పొందాలని యువతకు సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ మంచి నేచర్ గైడ్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**-చెంచు గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధితో పాటు అడవి పరిరక్షణకు కృషి**

నేచర్ గైడ్ శిక్షణను కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమంగా కాకుండా అటవీ పరిరక్షణలో చెంచు యువతను భాగస్వామ్యం చేసే దీర్ఘకాలిక కార్యక్రమంగా చూడాలని ఆయన పేర్కొన్నారు. పర్యాటకులకు అడవి అందాలను పరిచయం చేస్తూనే ప్రకృతి పట్ల బాధ్యతను కల్పించడం వన్యప్రాణులను సంరక్షించడం అటవీ సంపదను భవిష్యత్ తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.స్థానిక గిరిజనులు అటవీశాఖ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా పర్యాటకులు సమన్వయంతో పనిచేస్తే నల్లమల ప్రకృతి సంపదను కాపాడుతూ బాధ్యతాయుతమైన ప్రకృతి పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని విఘ్నేష్ అప్పావు పేర్కొన్నారు.

# జగన్ పై ప్రత్తిపాటి ఫైర్

చిలకలూరిపేటఆగస్టు 10 వార్త సాక్ష్యం



వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళల భద్రతను విస్మరించి, నేరాల పెరుగుదలకు పరోక్షంగా కారణమైన జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని రాజమహేంద్రవరం పార్లమెంట్ టీడీపీ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు.వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి ఘటనపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి మెరుగైన వైద్యం అందించడంతో పాటు నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారని తెలిపారు. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఏపీ పోలీసుల దర్యాప్తుపై తమకు నమ్మకం ఉందని ప్రియాంక తండ్రి స్వయంగా చెప్పినప్పటికీ జగన్ పోలీసు వ్యవస్థపై విమర్శలు చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఆరోపించారు.జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మహిళలపై నేరాలు, వేధింపులు పెరిగాయని, గంజాయి, కల్తీ మద్యం, మాదక ద్రవ్యాల నియంత్రణలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ప్రత్తిపాటి విమర్శించారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం పేరుతో హామీలు ఇచ్చినా, నిందితులకు కఠిన శిక్షలు విధించడంలో విఫలమయ్యారని అన్నారు.ప్రతి ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ప్రత్తిపాటి ఆరోపించారు. ప్రియాంక మృతి వంటి విషాద ఘటనలను రాజకీయ అంశాలుగా మార్చడం సరికాదని, బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన అన్నారు.

# మృతదేహంపై పోలీసుల ఆరా

బాపట్ల ఆగస్టు 10 వార్త సాక్ష్యం



బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చవారిపాలెం పొలాల వద్ద సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

**-సమాచారం కోసం:**

బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ పి. ప్రభాకరరావు: 9440796258 ఎస్సై ఎన్. అలేఖ్య: 6303079112

# గడ్డివామి దగ్ధం



కర్లపాలెంఆగస్టు 10 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలం నర్రావారిపాలెంలో మండల కన్వీనర్ ఏడుకొండలకు చెందిన గడ్డివామి దగ్ధమైన ఘటనపై మాజీ డిప్యూటీ స్పీకర్, వైసీపీ నాయకుడు కోన రఘుపతి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన తీరును, గడ్డివామి దగ్ధానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రమాదంతో నష్టపోయిన బాధితులను కోన రఘుపతి పరామర్శించి, వారికి జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తూ, బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టపడి సమకూర్చుకున్న గడ్డివామి అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా తెలుసుకుని, బాధితులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కోన రఘుపతి వెంట వైసీపీ నాయకులు పేరాల వెంకట సురేష్, డేవిడ్, తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ ఏడుకొండలు, నర్రా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించడంలో పస్పిల్ మున్నా ను ఆదర్శం గా తీసుకోండి






**-జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం ఎన్. వి .రాజు**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం

క్రీడలకు పుట్టినిల్లు అయిన ఆత్మకూరు పురపాలక సంఘం లో రాష్ట్రం లో ఎక్కడ లేని విధంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో సోమవారం జిల్లా క్రీడా మైదానం కార్యాలయంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా కు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం ఎన్ వి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా ను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు వాలీబాల్ క్రీడలకు ఆత్మకూరు నుంచి టీం తీసుకొని వచ్చి వారిని క్రీడల్లో పాల్గొనేలా మున్నా కృషి చేశారన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే సహకారంతో రాష్ట్రం లో జరిగే ప్రతి క్రీడల్లో ఆత్మకూరు స్టేడియం క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఇటీవలే జరిగిన నంద్యాల జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ లో ఆత్మకూరు స్టేడియం కి సంబంధించిన (బాలుర) ఖోఖో అండర్ -17 మరియు అండర్ -23 అలాగే కబడ్డీ అండర్ - 17 విభాగాల్లో జిల్లా విజేతగా ఆత్మకూరు క్రీడాకారులు నిలిచారని తెలిపారు.ఆత్మకూరు స్టేడియం లో క్రీడాకారులు అన్ని రకాల క్రీడల్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా సెక్రటరీ నాగరాజు, క్రీడశిక్షకులు తదితరులు పాల్గొన్నారు

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# రేషన్ దుకాణంలో తనిఖీ

**-39.20 క్వింటాళ్ల బియ్యం, 101 ప్యాకెట్ల పంచదార కొరత**

బాపట్లఆగస్టు 10 వార్త సాక్ష్యం



బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో వరలక్ష్మి డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చౌక ధరల దుకాణం నంబర్ 0757091లో సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దండమూడి విక్టోరియమ్మ డీలర్‌గా నిర్వహిస్తున్న ఈ దుకాణంలో రికార్డుల ప్రకారం ఉండాల్సిన నిత్యావసర సరుకుల నిల్వలు, వాస్తవ నిల్వలను పరిశీలించగా పలు వ్యత్యాసాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలో 39.20 క్వింటాళ్ల బియ్యం, 101 ప్యాకెట్ల పంచదార, 12 ప్యాకెట్ల గోధుమ పిండి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు గుర్తించ దంతో డీలర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వారికి నివేదికలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో బాపట్ల సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ సి.వి.ఎల్. ఫణి కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి పులి శ్రీనివాసరావుతో పాటు మధ్యవర్తులు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



బాపట్ల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణంలోని గులాంహుసేన్ తోటలో శ్రీ పోలేరమ్మ, శ్రీ జాలమ్మ అమ్మవార్ల మొక్కుబడి కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీ పోలేరమ్మ, శ్రీ జాలమ్మ అమ్మవార్ల దివ్య ఆశీస్సులు బాపట్ల నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఆలయ నిర్మాణానికి దాతల చేయూత

**-రూ.51,116 విరాళం అందజేసిన పుల్లగండం దంపతులు**



బాపట్ల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీ పుల్లగండం వెంకట శ్రీనివాసరావు--కల్పన దంపతులు రూ.51,116 విరాళాన్ని చెక్కు రూపంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజుకు అందజేశారు. బాపట్ల నియోజకవర్గ 'విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ౕా4' కార్యాలయంలో ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా పవిత్ర దైవకార్యానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళం అందించిన దంపతులను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు అభినందించారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, భక్తులకు మరియు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**-కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి**

**-ప్రజా సంఘాల డిమాండ్**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం



రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు లు అన్నారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సిఐటియు, ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ల ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వము రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వము ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టే అమెరికాతో చేస్తున్న అన్ని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించు కోవాలన్నారు. సమగ్రమైన రైతులకు రుణమాఫీ ప్రకటించి రైతు ఆత్మహత్యలను నివారించాలని, కరువు మండలాలు ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల అందరికీ కనీస వేతనం అమలు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించి, 200 రోజులు పది దినాలు కల్పించి రోజు వేతనం రూ.700 ఇవ్వాల న్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతు పంట రుణాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సద్దాం, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, కొత్తపల్లి మండల కార్యదర్శి దినేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, నాయకులు సంజీవ రాయుడు, కిరణ్, ప్రజా సంఘాల నాయకులు ఎస్ ఆర్ రమణ, రంగస్వామి, గణపతి, వెంకటేశ్వర్లు, ముర్తుజా, రహం, సాయి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో- శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన





**-విద్యార్థులు మహిళల రక్షణ కోసమే శక్తి యాప్**

**-చట్టాలపై అవగాహన కల్పించుకోవడంలో ముందుండాలి**

**-పాములపాడు ఏఎస్ఐ, షేక్. నూర్ అహమ్మద్**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ " శక్తి యాప్ టీం " ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలతో ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ . మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణ లో ఆత్మకూరు " శక్తీ టీం " సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, సుప్రియ ల సహకారంతో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న ఆధ్వర్యంలో 250 మంది కాలేజ్ విద్యార్థినీ, విద్యా ర్థులకు " శక్తీ యాప్ పై అవగాహన కార్య క్రమం కల్పించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శక్తి టీం ఎస్ఐ షేక్ నూర్ అహ్మద్ మాట్లాడుతూ " మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం అయినది, సార్. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా మీరు మంచి క్రమశిక్షణ తో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను " ఈవిటీజింగ్ " పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే ఏ మాత్రం అధైర్య పడకుండా, మీకు భరోసాను మరియు ధైర్యాన్ని ఇచ్చే మీకు రక్షణ ఉండేలాగా మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తీ యాప్ ను ఉపయోగించి 112 కు గానీ 1098 కి గానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని అవేర్నెస్ చేసినాము. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపకూడదని తెలియజేశారు చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని. చదువు ఒక్కటే మిమ్మల్ని సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మార్చేది చదువు ఒక్కటే అని తెలుపుతూ.. అదేవిధంగా మీ ఇంట్లోని మీ పేరెంట్స్ మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు నాన్న,అన్నా,బాబాయి,మేనమామ లు ఎవ్వరైనా సరే మధ్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచిస్తూ...త్రాగి వాహనం నడిపి పోలీస్ సార్వాళ్ళకు చిక్కి కేసు పెట్టి కోర్టు కు పంపిస్తే కోర్టు జడ్జి వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అని విద్యార్థిని విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# చిన్న వయసులోనే అద్భుతమైన సాహసం







**-ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన పర్వతం**

**- కిలిమంజారోను అధిరోహించి ఉహురు పీక్ ను చేరుకున్న ఆరవ్ రెడ్డి.**

**-నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచిన అరవ్ రెడ్డి**

నంద్యాల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

చిన్న వయస్సులోనే పట్టుదల, ధైర్యం, ఆత్మ విశ్వాసం, దేశభక్తి తో అద్భుతమైన సాహసం చేసి ఆఫ్రికా ఖండం లోని అత్యంత ఎత్తైన పర్వతం మౌంట్ కిలిమంజారోఅధిరోహించి ఉహుర్ పీక్ ను చేరుకున్న అరవ్ రెడ్డి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెల్లెలు, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, బైరెడ్డి రాజశేఖరరెడ్డి కూతురు శర్వాణి పెద్ద కుమారుడు నేటి తరానికి స్ఫూర్తి గా నిలిచారు. అంతేకాకుండా, 9,600 చదరపు అడుగుల భారీ త్రివర్ణ పతాకాన్ని మోసుకుంటూ కిలిమంజారో ఉహురు పీక్ ను చేరి, భారతదేశ ఔన్నత్యాన్ని ఆఫ్రికా ఖండంలోని అత్యున్నత శిఖరంపై చాటిచెప్పడం మరింత గర్వకారణం. "నేను చేయలేను" అనే మాటను "నేను చేసి చూపిస్తాను"గా మార్చుకుంటూ, ఎన్నో సవాళ్లను అధిగమించి ఈ అద్భుత సాహసాన్ని పూర్తి చేశారు. ఈ ఘనతకు గుర్తింపుగా UNICO World Records నుంచి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. చిన్న వయసులోనే ఇంతటి ఘనత సాధించిన ఆరవ్ రెడ్డి పట్టుదల, ధైర్యం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి నేటి తరానికి ఎంతో గొప్ప స్ఫూర్తిదాయకం. సాహస వీరుడు ఆరవ్ రెడ్డిని పలువురు అభినందించారు

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 11 ఆగష్టు 2026

# శ్రీశైలం ఆలయ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధికి శ్రీకారం

**-భారత పార్లమెంట్ లో ప్రశ్నించిన నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి.**

నంద్యాల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

గత ఐదేళ్లలో నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలంతో సహా ఆలయ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి కోసం, దాని పరిసర ప్రాంతాలలో కనెక్టివిటీ, పర్యాటక సౌకర్యాలు, వారసత్వ సంరక్షణ, భద్రత, ఇతర పర్యాటక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలు, ప్రతిపాదించిన చర్యల వివరాలపై సోమవారం భారత పార్లమెంట్ దృష్టికి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో శ్రీశైలంలో పర్యాటక మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేయబడిన, విడుదల చేయబడిన, వినియోగించబడిన కేంద్ర సహాయానికి సంబంధిెంచిన పథకాల వారీగా సంవత్సరాల వారీగా వివరాలు ఇవ్వాలని, ప్రభుత్వం శ్రీశైలాన్ని ఏదైనా ప్రస్తుత లేదా ప్రతిపాదిత ఆలయ/ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌లో చేర్చాలని ప్రతిపాదిస్తోందా, ఒకవేళ ప్రతిపాదిస్తుంటే, దానికి సంబంధించిన వివరాలు, కాలపరిమితిని తెలపండని కోరారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రశ్నకు సమాధానం ఇస్తూ. పర్యాటక ఉత్పత్తుల అభివృద్ధి, ప్రోత్సాహం ప్రధానంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీ) పరిపాలనలచే చేపట్టబడుతుందని. అయితే, పర్యాటక మంత్రిత్వ శాఖ, తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి కార్యక్రమం (ప్రషాద్) వంటి తన వివిధ పథకాల కింద, స్వదేశ్ దర్శన్ , స్వదేశ్ దర్శన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా దేశవ్యాప్తంగా పర్యాటక సంబంధిత మౌలిక సదుపాయాలు, అనుభవాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రయత్నాలకు తోడ్పాటునిస్తాయన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనల నుండి ప్రతిపాదనలను స్వీకరించడం ఒక నిరంతర ప్రక్రియ. అందిన ప్రతిపాదనలను నిర్దేశిత మార్గద ర్శకాల ప్రకారం పరిశీలించి, నిర్దేశించిన షరతులను నెరవేర్చడం, నిధుల లభ్యతకు లోబడి అటువంటి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. మంత్రిత్వ శాఖ తన ప్రసాద్ పథకం కింద 'శ్రీశైలం ఆలయ అభివృద్ధి' అనే ప్రాజెక్టును రూ.43.08 కోట్ల వ్యయంతో మంజూరు చేసిందని. మొత్తం రూ.43.08 కోట్ల నిధులను విడుదల చేసి, వినియోగించడం జరిగిందని. సదరు ప్రాజెక్ట్ పూర్తయిందన్నారు. సదరు ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేయబడిన ప్రధాన అంశాలలో విద్యుద్దీకరణ, పర్యాటక సౌకర్యాల కేంద్రం, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్, ర్యాంప్, టాయిలెట్ కాంప్లెక్స్‌లు, తాగునీటి సౌకర్యం, రహదారి అభివృద్ధి పనులు మొదలైనవి ఉన్నాయని కేంద్ర మంత్రి సమాధానం చెప్పారు.



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు జ్ఞాపిక అందేజేస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**-కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను మర్యాద పూర్వకంగా కలిసిన**

**-ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

న్యూ ఢిల్లీలో సోమవారం సహచర తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను ఆయన కార్యాలయంలో కలవడం జరిగిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాధాన్యత, అభివృద్ధి, భవిష్యత్ దార్శనికతను ప్రతిబింబించే పుస్తకాన్ని హోంమంత్రి కి అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# నంద్యాల జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

**-మహాత్మ జ్యోతిరావు పూలేబాలుర రెసిడెన్షియల్ 5, 6వ తరగతుల అడ్మిషన్లపై సమగ్రమైన విచారణ చేపట్టాలి**

**-రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి**

నంద్యాల ఆగస్టు 10 వార్త సాక్ష్యం





నంద్యాల జిల్లాలోని సున్నిపెంట, శ్రీశైలం, ప్రాజెక్టు పరిధిలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లో 5, 6వ తరగతుల అడ్మిషన్లలో అక్రమాలు, విద్యార్థుల డైట్ నిధుల వినియోగంలో అవకతవకలు, భోజనం, కూరగాయలు,గుడ్లు తదితర సరుకుల కొనుగోలులో అక్రమాల ఆరోపణలు మరియు సిబ్బంది నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా,రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి డిమాండ్ చేశారు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ల్ అధికారి వెంకట శివ కు ప్రజా సమస్య వేదిక లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నిపెంటలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్/వసతి గృహంలో విద్యార్థుల అడ్మిషన్లు, డైట్ నిర్వహణ, భోజన నాణ్యత మరియు సిబ్బంది పర్యవేక్షణకు సంబంధించి కొన్ని తీవ్రమైన ఆరోపణలు మరియు అనుమానాలు మా దృష్టికి వచ్చాయి. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని క్రింది అంశాలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించవలసిందిగా కోరుతున్నాను. 5 మరియు 6వ తరగతుల అడ్మిషన్లపై విచారణ ప్రస్తుత విద్యాసంవత్సరంలో 5, 6వ తరగతుల ప్రవేశాల్లో మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు మరియు అధికారిక ఎంపిక ప్రక్రియ పాటించారా లేదా అనే అంశంపై విచారణ జరిపించాలి. ఎంపికైన విద్యార్థుల మెరిట్ జాబితా, రిజర్వేషన్ కేటగిరీ, దరఖాస్తుల సంఖ్య, ఎంపికైన విద్యార్థుల జాబితా మరియు అడ్మిషన్ రికార్డులను పరిశీలించాలి.విద్యార్థుల డైట్ నిధులు మరియు ఆహార సరుకులపై విచారణ: వసతి గృహంలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం కేటాయించిన డైట్ నిధులు పూర్తిగా మరియు నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా పరిశీలించాలి. ముఖ్యంగా గుడ్లు, కూరగాయలు, బియ్యం, పప్పులు, నూనె మరియు ఇతర నిత్యావసర సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు మరియు చెల్లింపులను తనిఖీ చేయాలి.విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతపై తనిఖీ విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అమలు చేస్తున్నారా, నిర్ణీత పరిమాణంలో ఆహారం అందిస్తున్నారా, గుడ్లు మరియు కూరగాయలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలపై అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించాలి. అవసరమైతే ఆహార పదార్థాల నాణ్యతను కూడా పరీక్షించాలి.రికార్డులు మరియు బిల్లుల పరిశీలన: డైట్‌కు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, స్టాక్ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్లు, మెనూ రిజిస్టర్లు, కొనుగోలు రికార్డులు, బ్యాంక్/చెల్లింపు వివరాలు మరియు సంబంధిత ఇతర రికార్డులను స్వాధీనం చేసుకుని/పరిశీలించి, వాస్తవ విద్యార్థుల సంఖ్యతో సరిపోల్చి చూడాలి.వార్డెన్ మరియు సంబంధిత సిబ్బంది బాధ్యతపై విచారణ చేపట్టి వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్/సంబంధిత సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారా లేదా అనే అంశంపై విచారణ జరిపించాలి. నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

**-విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ:**

విచారణ సమయంలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేదా ప్రతీకార చర్యలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల నుంచి స్వతంత్రంగా సమాచారం సేకరించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలి. అధికారులను విజ్ఞప్తి చేశారు. పై అంశాలన్నింటిపై జిల్లా స్థాయి స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీ నిర్వహించి, సంబంధిత రికార్డులు మరియు బిల్లులను పూర్తిగా పరిశీలించి, విద్యార్థులు/తల్లిదండ్రుల వాంగ్మూలాలను నమోదు చేసి, ఆరోపణలు వాస్తవమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అలాగే విచారణ నివేదికను ప్రజలకు /ఫిర్యాదుదారునికి నిబంధనల మేరకు తెలియజేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి మరియు భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం రూపంలో అధికారులను కోరారు

# ఆత్మకూరు పురపాలక సంఘం అభివృద్ధికి, రూ" 9 లక్షలతో భూమి పూజ

**-పట్టణ అభివృద్ధికి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారం**

**-పట్టణ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా అధికార యంత్రాంగం**

**-ఆత్మకూరు పురపాలక సంఘం కమిషనర్ బేబీ, సింగిల్ విండో చైర్మన్ ఏ. షాబుద్దీన్**

ఆత్మకూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం



పురపాలక సంఘం అభివృద్ధి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఏ. షహబుద్దీన్, మున్సిపల్ కమిషనర్ బేబీ, టిడిపి పట్టణ అధ్యక్షుడు, జెట్టి వేణుగోపాల్ టిడిపి సీనియర్ యువ నాయకుడు సీనియర్ కాంట్రాక్టర్ వెన్న శ్రీధర్ రెడ్డి టిడిపి పార్టీ శ్రీశైలం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, లు అన్నారు సోమవారం పట్టణంలోని బిసి హాస్టల్ ఏరియా నందు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి దాదాపు 9 లక్షల రూపాయలతో డ్రైనేజ్ కాలువ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పురపాలక సంఘం కమిషనర్ టిడిపి నాయకులు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు కూటమి ప్రభుత్వంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అన్ని విధాలుగా అధికార యంత్రాంగం పని చేస్తుందని వివరించారు ముఖ్యంగా నూతన సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు, మంచినీటి వసతులు, పైపులైన్లు కాలనీలకు విద్యుత్ దీపాలు తో పాటు మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ షాహిర్,, మున్సిపల్ సిబ్బంది రాజేష్, నాయకులు అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఏర్పాటుతో పార్టీ మరింత బలోపేతం

**-పర్చూరు మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొల్లా శ్రీనివాసరావు, ఉప్పుటూరి నరేంద్ర, కొమ్మనబోయిన లక్ష్మీబాబు**

పర్చూరు ఆగస్టు 10 వార్త సాక్ష్యం



తెలుగుదేశం పార్టీ పర్చూరు మండల నూతన కమిటీని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నాగులపాలెంకు చెందిన కొల్లా శ్రీనివాసరావును మండల అధ్యక్షుడిగా, పర్చూరుకు చెందిన ఉప్పుటూరి నరేంద్రను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మండల ఉపాధ్యక్షుడిగా చెరుకూరుకు చెందిన కొమ్మనబోయిన లక్ష్మణ్‌బాబును, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కొల్లా శివరామ్ ప్రసాద్, ద్రోణాదుల శ్రీరాములు, జూపూడి మార్కులను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా పొన్నలూరి వెంకటేశ్వర్లు, నిడమానూరి ఖాజాబీ, దుడ్డు సల్మాన్, కోశాధికారిగా పుల్లెల సుబ్బారావును నియమించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ సమష్టిగా పనిచేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రభుత్వానికి--ప్రజలకు వారధిగా నిలిచి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని కోరారు.

# డీఎస్సీ అవకతవకలపై కోన ఆగ్రహం

**-మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోన రఘుపతి డిమాండ్**



బాపట్ల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

డీఎస్సీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన రఘుపతి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాపట్ల కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో కోన రఘుపతి నేతృత్వంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ మెగా డీఎస్సీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అంశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం మహిళలు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కోన ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇస్తామని ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. నారా లోకేష్ చర్చలకు సిద్ధమంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కోన రఘుపతి వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వం మేల్కొని ప్రజలను ఆదుకోవాలని అన్నారు. డీఎస్సీ అవకతవకలపై తక్షణ చర్యలు తీసుకుని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కోన రఘుపతి హెచ్చరించారు.

# స్వతంత్ర వేడుకలకు సన్నద్ధం

బాపట్ల ఆగస్టు 10 వార్త సాక్ష్యం



80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం నిర్దేశించిన వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. విజన్ 2047పై ప్రభుత్వ ఉద్యోగులు సెల్ఫీ వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని, విద్యార్థులతోనూ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 12 నుంచి 15వ తేదీ వరకు మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో సైకిల్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. 13 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద, దుకాణాల వద్ద త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలని ఆదేశించారు. 14న ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. 14, 15 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాలను జాతీయ జెండా రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. అన్ని కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
మంగళవారం 11 ఆగష్టు 2026

## రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్ పై స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ఈ చిత్రబృందం ప్రమోషన్ల స్పీడు పెంచింది. ఈ క్రమంలో, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్ ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "తన కుటుంబాన్ని కాపాడేందుకు ఓ వ్యక్తి విశ్వాసాన్నే తన అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని చేసే ప్రయాణమే ఈ సినిమా" అంటూ విడుదల చేసిన ట్యాగ్‌లైన్, 'ఇరుముడి' అనే టైటిల్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్‌తో కలిసి నిర్మిస్తోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.




## కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'

## పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం




వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం.ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్త ంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించను న్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కను న్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు.ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు.జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర' వంటి భారీ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో తనదైన ముద్ర వేయాలని కిరణ్ అబ్బవరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.



## ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం

## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!

స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే - డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది. గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రోళ్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




## కొడుక్కి రామ్ చరణ్ పేరు.. అభిమాని ప్రేమకు ఫిదా

## ఇంటికి పిలిచిన చిరంజీవి!

మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు. వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు. ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.